రాచకొండలో 'గోల్డెన్' కేర్ ప్రారంభం

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

సీనియర్ సిటిజన్ల కోసం రాచకొండ కమిషనరేట్లో 'గోల్డెన్ కేర్' కార్యక్రమాన్ని ప్రారంభించారు. గురువారం హైదరాబాద్ నేరేడ్‌మెట్‌లోని రాచకొండ పోలీసు కమిషనర్ కార్యాలయంలో సీనియర్ సిటిజన్స్ భద్రతకు సంబంధించి రాచకొండ పోలీసులు, రాచకొండ సెక్యూరిటీ కౌన్సిల్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన 'గోల్డెన్ కేర్' కార్యక్రమాన్ని సీపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. సీనియర్ సిటిజన్లను సరిగా చూసుకోకపోవడం, భోజనం పెట్టకపోవడం, వారిని హింసించడం వంటివి చేస్తే చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ గోల్డెన్ కేర్ కార్యక్రమంలో భాగంగా పోలీసు కమిషనరేట్ పరిధిలోని 47పోలీస్‌స్టేషన్లకుగాను.. ప్రతి పోలీసు స్టేషన్ పరిధిలోనూ 70 సంవత్సరాలు దాటిన 10 మంది సీనియర్ సిటిజన్లను గుర్తించి ఒక డేటాను తయారు చేస్తామని తెలిపారు. సీనియర్ సిటిజన్లకు చెందిన ఇన్స్పెక్టర్, ఎస్ఐ, డీసీపీ, అదనపు డీసీపీ, ఏసీపీలు వారికి అనుగుణంగా ఉన్న సమయంలో వెళ్లి పలకరిస్తారని, అవసరమైన సహాయం చేస్తారని చెప్పారు. సైబర్ నేరాలపై వివరిస్తారని తెలిపారు. మొదటి విడతలో రాచకొండ సెక్యూరిటీ కౌన్సిల్ ప్రతినిధులతో కలిసి మొత్తం 470 మందిని గుర్తించి ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని, వృద్ధుల కోసం మరిన్ని కార్యక్రమాలు నిర్వహిస్తామని సీపీ తెలిపారు. సీనియర్ సిటిజన్లు ఎవరైనా పోలీసు సేవల కోసం హెల్ప్‌లైన్ నెంబరు 14567 లేదా రాచకొండ వాట్సాప్ నెంబరు 8712662111ను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిసిపిలు పద్మజ, ప్రవీణ్ కుమార్, సునీతా రెడ్డి, అక్షాంక్ష యాదవ్, ఇందిర, ఉషా విశ్వనాథ్, నాగలక్ష్మి, అరవింద్ బాబు, రమణరెడ్డి, మనోహర్, అదనపు డీసీపీలు, ఏసీపీలు, రాచకొండ సెక్యూరిటీ కౌన్సిల్ ప్రతినిధులు శివకారడీ, సావిత్రి సూర్యనారాయణ, వృద్ధులు పాల్గొన్నారు

అంగన్‌వాడీల చలో సెక్రటేరియట్ ఉద్రిక్తం

- దోమల్‌గూడలో ర్యాలీని అడ్డుకున్న పోలీసులు
- ఇందిరాపార్కు వద్ద ప్రధాన రహదారిపై బైఠాయింపు
- అరెస్టు చేసే క్రమంలో పోలీసులు అత్యుత్సాహం
- పాలడుగు భాస్కర్‌తో సహ పలువురి నేతల అరెస్టు
- అక్టోబర్ 8న సమ్మె : జయలక్ష్మి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ (సిఐటియు అనుబంధం) ఇచ్చిన చలో సచివాలయ ముట్టడి ఉద్రిక్తంగా మారింది. పోలీసులు నిర్బంధం విధించినా...గృహ నిర్బంధాలు చేసినా...పోలీసుల బెదిరింపులు, హెచ్చరికలను భేఖాతరు చేస్తూ గురువారం వేలాది మంది అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు హైదరాబాద్‌కు తరలొచ్చారు. దోమలగూడలోని ఎవి కాలేజ్ సమీపంలో పెద్ద ఎత్తున పోగై ర్యాలీగా వెళ్తున్న క్రమంలో ఇందిరాపార్కు సమీపంలోని ప్రధాన రహదారిపై పోలీసులు అడ్డుకున్నారు. దీంతో సిఐటియు, ఆ యూనియన్ నాయకులు, అంగన్‌వాడీలు అక్కడే బైఠాయించారు. తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు అంగన్‌వాడీలకు రూ.18 వేల వేతనం ఇవ్వాలి... ప్రీ ప్రైమరీ, సిఎం శ్రీవిద్య నిర్వహణ బాధ్యత అంగన్‌వాడీలకే ఇవ్వాలి...రిటైర్మెంట్ బెనిఫిట్స్ చెల్లించాలి...24 రోజుల సమ్మె వేతనాలివ్వాలి...పెండింగ్ సమస్యలన్నింటినీ పరిష్కరించాలి' అని నినాదాలు చేశారు. క్రమంగా అక్కడ అంగన్‌వాడీల సంఖ్య పెరుగుతుండటంతో పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించారు. మహిళలని కూడా చూడకుండా యూనియన్ నాయకులపైనా, టీచర్లపైనా పిడిగుద్దులు గుద్దుతూ..గిచ్చుతూ బలవంతంగా కాళ్లు, చేతులు పట్టి ఈడ్చుకెళ్లి వ్యాన్లలో పడేశారు. అక్కడ జరిగిన తోపులాటలో ఆ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జయలక్ష్మి సొమ్మసిల్లి పడిపోయారు. అయినా వదలకుండా పోలీసులు ఆమెను బలవంతంగా లాక్కెళ్లి వ్యాన్ ఎక్కించారు. ఆమెతోపాటు సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్, కె.ఈశ్వర్‌రావు, రాష్ట్ర కార్యదర్శులు జె.వెంకటేశ్, పిల్లాల శ్రీకాంత్, అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు సునీత, కోశాధికారి మంగతో పాటు కవిత, స్వప్న, పద్మ తదితరులను పోలీసులు అరెస్టు చేశారు. నాయకులను తీసుకెళ్తున్న పోలీసు వ్యాన్లను అంగన్‌వాడీలు అడ్డుకునే ప్రయత్నం చేశారు. దీంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. వారందర్నీ చిక్కడపల్లి, అంబర్‌పేట, ఖైరతాబాద్, అబిడ్స్, దోమలగూడ, ఉస్మాన్‌గంజ్ తదితర పోలీస్ స్టేషన్లలో నిర్బంధించారు.

మరోవైపు కొందరు అంగన్‌వాడీలు సచివాలయం వైపు పరుగులు తీశారు. ట్యాంకుబండ్ వరకు చేరుకోగానే పెద్దఎత్తున పోగైన పోలీసులు వారిని అడ్డుకుని బలవంతంగా అరెస్టు చేశారు. మరికొందర్ని అంబేద్కర్ విగ్రహం వద్ద అదుపులోకి తీసుకున్నారు. సచివాలయం చుట్టూ పెద్దఎత్తున పోలీసులు మోహరించి అడ్డుకున్నా ప్రధాన గేటు వద్దకు చేరుకునే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో వారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

జిల్లాల్లో ఎక్కడికక్కడ అడ్డగింతలు... అరెస్టులు

అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల చలో సెక్రటేరియట్ పిలుపు నేపథ్యంలో బుధవారం నుంచే పోలీసులు రంగంలోకి దిగారు. గ్రామాల వారీగా అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల వివరాలు తీసుకున్నారు. హైదరాబాద్‌కు వెళ్లొద్దని బెదిరించారు. జిల్లా, మండల నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. పలువురిని గృహాల్లోనే నిర్బంధించారు.

ప్రభుత్వ నిర్బంధ కాండను ఖండిస్తున్నాం :: పి.జయలక్ష్మి

తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి. జయలక్ష్మి మాట్లాడుతూ... ప్రభుత్వ నిర్బంధకాండను తీవ్రంగా ఖండించారు. అక్టోబర్ 8న సమ్మె చేయాలని పిలుపునిచ్చారు. ఆన్‌లైన్ కార్యక్రమాలు కూడా బంద్ చేస్తామని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే దిగొచ్చి అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ... అంగన్‌వాడీల ఉద్యమానికి సంపూర్ణ మద్దతు ఉంటుందని ప్రకటించారు. అంగన్‌వాడీల పట్ల రాష్ట్ర సర్కారు వ్యవహరిస్తున్న తీరును తప్పుబట్టారు. వారేమీ గొంతెమ్మ కోరికలు కోరట్లేదనీ, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను నెరవేర్చాలని రేవంత్‌రెడ్డి సర్కారును కోరుతున్నారని చెప్పారు. వారి సమస్యలను పరిష్కరించకపోతే పోరాటాన్ని తీవ్ర తరం చేస్తామని రాష్ట్ర సర్కారును హెచ్చరించారు.

కాళేశ్వరం అంశంలో స్మితా సభర్వాల్‌కు ఊరట

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాళేశ్వరం అంశంలో సీనియర్ ఐఎఎస్ అధికారిణి స్మితా సభర్వాల్‌కు హైకోర్టులో ఊరట లభించింది. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదిక ఆధారంగా ఆమెపై చర్యలు తీసుకోవద్దని ఉన్నత న్యాయస్థానం ఆదేశించింది. కాళేశ్వరం అంశంపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదికను స్మితా సభర్వాల్ హైకోర్టులో సవాల్ చేశారు. నోటీసులు జారీ, వాంగ్మూలం నమోదు చేసిన విధానాన్ని సవాల్ చేసిన ఆమె.. ఆ నివేదికను కొట్టివేయాలని కోరుతూ పిటిషన్ దాఖలు చేశారు. ఈ నివేదిక ఆధారంగా తనపై తదుపరి చర్యలు చేపట్టకుండా ఆదేశాలివ్వాలని కోరారు. ఈ నేపథ్యంలో విచారణ చేపట్టిన హైకోర్టు.. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదిక ఆధారంగా స్మితా సభర్వాల్‌పై చర్యలు తీసుకోవద్దని స్పష్టం చేసింది

గ్రూప్-1 అభ్యర్థులకు రేపు నియామక పత్రాలు

- నేటిలోగా ధ్రువపత్రాల పరిశీలన పూర్తి చేయాలి
- అధికారులకు సిఎస్ రామకృష్ణారావు ఆదేశం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గ్రూప్-1 అభ్యర్థులకు శనివారం సాయంత్రం హైదరాబాద్‌లోని శిల్పకళావేదికలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా నియామకపత్రాలను అందించనున్నట్టు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు వెల్లడించారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లపై గురువారం హైదరాబాద్‌లోని సచివాలయంలో సిఎస్ టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. గ్రూప్-1 ఫలితాలను టిజిపిఎస్సీ బుధవారం విడుదల చేసింది. 563 పోస్టులకుగాను 562 మంది అభ్యర్థులను ఎంపిక చేసిన విషయం తెలిసిందే. గ్రూప్-1 పోస్టులకు ఎంపికైన 562 మంది అభ్యర్థులకు నియామకపత్రాలను అందిస్తామని తెలిపారు. దాదాపు 18 శాఖలకు చెందిన అభ్యర్థులు ఎంపికయ్యారని వివరించారు. ఈ కార్యక్రమానికి మంత్రులందరినీ ఆహ్వానిస్తున్నామని పేర్కొన్నారు. ధ్రువపత్రాల పరిశీలన కార్యక్రమం శుక్రవారంలోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా ఈ కార్యక్రమానికి ఒక్కొక్క అభ్యర్థికి చెందిన ఇద్దరు కుటుంబ సభ్యులను అనుమతించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ నియామకాల్లో అత్యధికంగా రెవెన్యూ, హోం, పంచాయతీరాజ్ శాఖలకు చెందిన వారే ఉన్నారని వివరించారు. రెవెన్యూ, హోం, జిఏడి కార్యదర్శులు ఈ కార్యక్రమ నిర్వహణలో సమన్వయంతో ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. నియామక పత్రాలు పొందే అభ్యర్థులు రాబోయే 30 ఏండ్లపాటు సర్వీస్‌లో ఉంటారనీ, వారికి హార్థిక ఉత్తేజకరమైన వాతావరణంలో నియామక పత్రాలు అందచేయాలని వివరించారు. ప్రభుత్వ సర్వీస్ పట్ల వారికి ఉన్నత భావన కలిగేలా కార్యక్రమాన్ని నిర్వహించేందుకు తగు ఏర్పాట్లు చేయాలని అధికారులను సిఎస్ ఆదేశించారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

- అరెస్టు చేసిన వారిని విడుదల చేయాలి : జాన్‌వెస్లీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సమస్యలను పరిష్కరించాలంటూ చలో హైదరాబాద్ కార్యక్రమానికి వచ్చిన అంగన్‌వాడీలను పోలీసులు అరెస్టు చేయడాన్ని సిపిఎం రాష్ట్ర కమిటీ ఖండించింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. బుధవారమే జిల్లాల్లో ఎక్కడికక్కడ వందలాది మంది అంగన్‌వాడీ కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేశారని విమర్శించారు. హైదరాబాద్‌లో జరిగిన ర్యాలీ సందర్భంగా వారిని అరెస్టు చేయడాన్ని ఖండించారు. న్యాయమైన సమస్యలను ప్రభుత్వం వారితో చర్చించి పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కానీ అరెస్టు చేయడం సరైంది కాదని తెలిపారు. అరెస్టు చేసిన వారిని తక్షణమే విడుదల చేయాలని కోరారు.

అరెస్టు దుర్మార్గపు చర్య : ఎస్ఎఫ్ఐ

అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లను పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడం దుర్మార్గపు చర్య అని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర కమిటీ విమర్శించింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎస్ రజినీకాంత్, కార్యదర్శి టి నాగరాజు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. అధికారంలోకి వస్తే సమస్యలను పరిష్కరిస్తామంటూ హామీ ఇచ్చి ఇప్పుడు ఐసిడిఎస్‌ను, అంగన్‌వాడీలను మూసివేసే కుట్రలను కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్నదని విమర్శించారు. ప్రీప్రైమరీ పాఠశాలల ఏర్పాటు పేరుతో అంగన్‌వాడీలను ఎత్తేసే ప్రయత్నం చేస్తున్నదని తెలిపారు. చలో హైదరాబాద్‌కు రాకుండా జిల్లాల్లో నిర్బంధం ప్రయోగించడంతోపాటు హైదరాబాద్‌కు వచ్చాక కూడా పోలీసులు తీవ్ర నిర్బంధం ప్రయోగించి అరెస్టు చేశారని విమర్శించారు. వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

న్యాక్ సీనియర్ ఇన్‌స్ట్రక్టర్ స్నేహలతకు రాష్ట్రపతి అవార్డు

- మంత్రి కోమటిరెడ్డి అభినందన

స్నేహలతను అభినందిస్తున్న రాష్ట్రపతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్(న్యాక్)ను అత్యుత్తమ స్కిల్ డెవల్మపెంట్ వేదికగా తీర్చిదిద్దేందుకు ప్రజా ప్రభుత్వం కషి చేస్తున్నదని రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి, న్యాక్ వైస్‌చైర్మెన్ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచనల మేరకు విద్యార్థుల్లో స్కిల్ డెవల్మపెంట్ పెంపొందించాలనే లక్ష్యంతో ఇప్పటికే ప్రజా ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా స్కిల్ డెవల్మపెంట్ సెంటర్స్ ఏర్పాటు చేస్తున్నదని తెలిపారు. సెప్టెంబర్ ఐదు టీచర్స్ డే పురస్కరించుకొని ఢిల్లీలో రాష్ట్రపతి చేతుల మీదుగా జాతీయ అవార్డు అందుకున్న న్యాక్ సీనియర్ ఇన్‌స్ట్రక్టర్ స్నేహలత మంత్రిని గురువారం మంత్రుల నివాస సముదాయంలోని క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. మినిస్ట్రీ ఆఫ్ స్కిల్ డెవలప్మెంట్ ఎంటర్ ప్రెన్యూర్షిప్ విభాగంలో ఉత్తమ టీచర్స్ అవార్డు అందుకున్న ఆమెను మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. శాలువాతో సత్కరించి, ఆమె పెద్దఎత్తున యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పన అందించిన సేవలను మెచ్చుకున్నారు. న్యాక్ ద్వారా నిరుద్యోగ యువతలో నైపుణ్యం పెంపొందించేందుకు ఉమ్మడి వరంగల్, కరీంనగర్, జగిత్యాల పట్టణాల్లో నిరుద్యోగ యువతకు సర్టిఫికెట్ కోర్సులు, ఉద్యోగ అవకాశాలు కల్పించే వత్తివిద్యా కోర్సులను అందిస్తూ, ఉత్తమ బోధన అందించేందుకు చేసిన కషికి గుర్తింపుగా ఈ అవార్డు దక్కిందని మంత్రి కొనియాడారు. దేశవ్యాప్తంగా 13 మంది ఈ అవార్డుకు ఎంపికైతే తెలంగాణ నుంచి న్యాక్ ఇన్‌స్ట్రక్టర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న హన్మకొండకు చెందిన నక్కా స్నేహలతకు అవార్డు రావడం తెలంగాణ రాష్ట్రానికి గర్వ కారణం అన్నారు. నల్లగొండలో అధునాతన హంగులతో నూతనంగా నిర్మిస్తున్న స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ అతిత్వరలో అందుబాటులోకి రానుందనీ, ఉమ్మడి జిల్లా యువతలో ప్రపంచంతో పోటీపడే నైపుణ్యం పెంపొందించేందుకు ఈ సెంటర్ ఉపయోగపడనుందని మంత్రి ఈ సందర్భంగా పేర్కొన్నారు. నైపుణ్యాలకు ఉత్తమ వేదికగా నేషనల్ అకాడమీ ఆఫ్ కనస్ట్రక్షన్‌ను బలోపేతం చేస్తున్నామని పేర్కొన్న మంత్రి, ప్రతిష్ఠాత్మక జాతీయ అవార్డు దక్కడంతో న్యాక్ ఫ్యాకల్టీ, సిబ్బందిలో మరింత ఉత్సాహాన్ని నింపిందన్నారు. స్నేహలతను ప్రోత్సహించిన న్యాక్ డైరెక్టర్ శాంతిశ్రీని మంత్రి ఈ సందర్భంగా అభినందించారు.

IN THE COURT OF THE PRL.DISTRICT JUDGE ANANTHAPURAMU
I.A.NO:1919/2025 in A.S NO: Nil/2025
Between:
P.Anuradha ...**Petitioner /Appellant**
AND
B. Manjuvani died rep by Lrs..B. Sreenivasa Murthy and others
...**Respondants/Plaintiffs/Defendants**
NOTICE TO THE RESPONDANT NO:6
R6:T.Sreedhar S/o Late T.C.Veeranna, Employee in BSNL C/o Chief General Manager Office, Abids, Hyderabad, Telangana State.
పై నెంబరు కేసులో 6 వ Respondant అయిన మీ హాజరు నిమిత్తము 24-10-2025వ తేది ఉదయం 10:30 గంటలకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వయంగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.
(By order of the court)
A.Rami Reddy,
G.Ramakishore Reddy
Advocates, Ananthapuramu,
Cell No: 98496 67645

భారీ వర్షాలున్నాయి... అధికారులంతా అప్రమత్తంగా ఉండాలి

- ఎలాంటి ప్రాణాపాయం జరగకూడదు : సిఎం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రానున్న రెండు రోజుల పాటు భారీ వర్షాలు కురుస్తాయనే వాతావరణ శాఖ నివేదికపై అన్ని శాఖలను ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డి అప్రమత్తం చేశారు. ఓ మోస్తారు నుంచి భారీ వర్షాలు పడే అవకాశముందని నిరంతరం జాగ్రత్తగా ఉండాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. గురువారం ఉన్నతాధికారులతో సమీక్షించారు. అన్ని జిల్లాల కలెక్టర్లు హై అలెర్ట్ గా ఉండి పరిస్థితిని సమీక్షించాలని కోరారు. అవసరమైతే లోతట్టు ప్రాంతాల్లో ప్రజలను ముందుగానే ఖాళీ చేయించి, పునరావాస కేంద్రాలను తరలించాలని సూచించారు. అన్ని కాజ్ వేలను పరిశీలించాలని, రోడ్లపైకి వరద నీరు నిలిచే ప్రాంతాలను గుర్తించి ముందస్తుగా ట్రాఫిక్‌ను నిలిపివేయాలన్నారు. విద్యుత్ శాఖ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అంతరాయం లేకుండా కరెంట్ సరఫరా ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. వేలాడే వైర్లను తొలగించటంతో పాటు, ఎలాంటి ప్రాణాపాయం జరగకుండా చూడాలన్నారు. దసరా సెలవులు ఉన్నప్పటికీ విద్యా సంస్థలు కూడా వర్షాలపై అప్రమత్తంగా ఉండాలని కోరారు. వర్షం కురిసే సమయంలో అవసరమైతేనే జనం రోడ్లపైకి రావాలని సూచించారు. హైదరాబాద్‌లో జిహెచ్ఎంసి, హైడ్రాతో పాటు, ఎన్‌డిఆర్ఎఫ్, ఎస్‌డిఆర్ఎఫ్ బృందాలు అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

కోటీశ్వరులను చేస్తామని చెప్పి పోలీస్ స్టేషన్లకు తరలిస్తారా?

- అంగన్‌వాడీల అరెస్టుపై మాజీ మంత్రి హరీశ్ రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మహిళలను కోటీశ్వరులను చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చి వారిని పోలీస్ స్టేషన్లకు తరలిస్తారా? అని మాజీ మంత్రి, బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. సమస్యల పరిష్కారం కోసం ఛలో సెక్రెటరియేట్ చేపట్టిన అంగన్‌వాడీల పట్ల ప్రభుత్వం పోలీసుల ద్వారా కర్కశంగా వ్యవహరించడాన్ని ఖండించారు. ఆడబిడ్డలకు బతుకమ్మ సంబురాలు లేకుండా చేస్తున్న రేవంత్ సర్కార్‌కు వారే బుద్ధి చెబుతారని హెచ్చరించారు. కెసిఆర్ అంగన్‌వాడీ వర్కర్లను టీచర్లుగా పోస్టును ఉన్నతీకరించి, వారి వేతనాన్ని రూ.4,200 నుంచి రూ.13,650కు, సహాయకుల వేతనాన్ని రూ.2,200 నుంచి రూ.7,800 పెంచారని గుర్తుచేశారు. అంగన్‌వాడీ టీచర్ల వేతనాన్ని రూ.18 వేలకు పెంచి ఇపిఎఫ్ పరిధిలోకి తెచ్చి ఉద్యోగ భద్రత కల్పిస్తామని హామీతో అధికారంలోకి వచ్చి 22 నెలలు గడిచినా వారిని పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు.

ఫారం నెం.యుఆర్‌సి-2
చట్టంలోని ఛాప్టర్ XXI యొక్క పార్ట్ I క్రింద రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన నోటీసు ఇవ్వవలసిన ప్రకటన (కంపెనీల చట్టం, 2013లోని సెక్షన్ 374(బి) మరియు కంపెనీస్ (రిజిష్టర్ చేయుటకు అధికారం ఇవ్వబడిన) రూల్స్, 2014లోని రూల్ 4(1)కు అనుగుణంగా)
1) ఇందుమూలంగా ప్రకటన ఇవ్వడమేమనగా వాటాల ద్వారా కంపెనీ లిమిటెడ్‌గా కంపెనీల చట్టం, 2013లోని ఛాప్టర్ XXI లోని పార్ట్ I క్రింద నమోదుకాబడుతున్న లిమిటెడ్ లయబిలిటీ పార్ట్‌నర్‌షిప్ అయిన **మెసర్స్ బిర్లా మెటల్స్ & అల్లాయ్స్ ఎల్ఎల్‌పి**కు సంబంధించి రిజిస్ట్రార్, సెంట్రల్ రిజిస్ట్రేషన్ సెంటర్ (సిఆర్‌సి), ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కార్పొరేట్ అఫైర్స్ (ఐఐసిఎ), ప్లాట్ నెం.6, 7, 8, సెక్టార్ 5, ఐఎంటి మనేసర్, జిల్లా గుర్గావ్(హర్యానా), పిన్‌కోడ్-122050 వారికి పదిహేను రోజుల తరువాత కానీ ముప్పై రోజులు ముగియుటకు ముందు దరఖాస్తు చేయుటకు ప్రతిపాదించచున్నదని కంపెనీల చట్టం, 2013లోని సెక్షన్366 యొక్క ఉప-సెక్షన్ (2)నకు అనుగుణంగా ఇందుమూలంగా తెలియజేయడమైనది.
2) కంపెనీ యొక్క ప్రధాన ఉద్దేశ్యాలు దిగువ విధంగా కలవు:
అన్ని రకాల లీడ్ మిశ్రమాలు, లెడ్ ఆక్సైడ్లు, లెడ్ సబ్‌ఆక్సైడ్ మరియు రెడ్ లీడ్ తయారీ, దిగుమతి, ఎగుమతి, కొనుగోలు, అమ్మకం, రిటైల్, హోల్‌సేల్, వ్యాపారం లేదా ఇతరత్రా లావాదేవీలు చేయడానికి.
3) ప్రతిపాదిత కంపెనీ యొక్క డ్రాఫ్ట్ మెమొరాండం మరియు ఆర్టికల్స్ ఆఫ్ అసోసియేషన్ ముసాయిదా ప్రతిని రిజిష్టర్డు ఆఫీసు: ప్లాట్ నెం.71/పి, సర్వే నెం.48, ఐడిఏ సబ్ ఎలక్ట్రిసిటీ ఆఫీస్ దగ్గర కట్టేడాన్, ఎల్ఇ, రాజేంద్రనగర్, హైదరాబాద్-500077, తెలంగాణలో తనిఖీ చేసుకోవచ్చును.
4) ఇందుమూలంగా ప్రకటన ఇవ్వడమేమనగా ఈ దరఖాస్తును వ్యతిరేకించదలచిన ఏ వ్యక్తి అయినా వారి అభ్యంతరాలను పై పేర్కొన్న ఎల్ఎల్‌పి దీని రిజిష్టర్డుఆఫీసులో ఒక కాపీతో ఈ ప్రకటన ప్రచురించిన తేదీ నుండి ఇరవై ఒక రోజుల్లోపు రిజిస్ట్రార్, సెంట్రల్ రిజిస్ట్రేషన్ సెంటర్ (సిఆర్‌సి), ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కార్పొరేట్ ఆఫైర్స్ (ఐఐసిఎ), ప్లాట్ నెం.6, 7, 8, సెక్టార్-5, ఐఎంటి-మనేసర్, జిల్లా గుర్గావ్ (హర్యానా), పిన్‌కోడ్-122050 వారికి వ్రాతపూర్వకంగా తెలియజేయవలెను.
తేదీ. శుక్రవారం, 26 సెప్టెంబర్, 2025, హైదరాబాద్, తెలంగాణ.
మెసర్స్ బిర్లా మెటల్స్ & అల్లాయ్స్ ఎల్ఎల్‌పి కొరకు
సం/- **అభిషేక్ బిర్లా** (డిసిగ్నేటెడ్ పార్ట్‌నర్) డిఐఎన్: **10036495**
సం/- **రాకేష్ మెండిరట్ట** (డిసిగ్నేటెడ్ పార్ట్‌నర్) డిఐఎన్: **10036496**

ఫైటర్ జెట్ 'సిమ్యులేటర్ల' తయారీలో హైదరాబాద్

- దేశ రక్షణ వ్యవస్థకు కీలకంగా మారనున్న కొత్త ఆవిష్కరణలు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

డ్రోన్లు, క్షిపణులు, విమానాల విడిభాగాలు, రక్షణరంగ ఉత్పత్తులతో దేశం దృష్టిని ఆకర్షిస్తున్న హైదరాబాద్ మరో భారీ ఆవిష్కరణకు సిద్ధమవుతోంది. రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలో టీ-వర్క్స్ వేదికగా యుద్ధ విమానాల ఫ్లైట్ సిమ్యులేటర్ రూపుదిద్దుకుంటోంది. ఎయిర్ ఫోర్స్, నేవీ యుద్ధ విమానాల పైలట్ల శిక్షణ కోసం అవసరమయ్యే సిమ్యులేటర్లను ఇప్పటి దాకా భారీ వ్యయంతో అమెరికా, యూరప్‌ల నుంచి దిగుమతి చేసుకుంటుండగా ఇకపై ఆ అవసరం ఉండదు. మనమే అగ్రదేశాలకు ఎగుమతి చేయగలిగే స్థాయికి చేరుకోనున్నాం. ఎయిర్ ఫోర్స్‌లో పైలట్లుగా ఎంపికైన అభ్యర్థులకు మొదట ఫ్లైట్ సిమ్యులేటర్లలో శిక్షణ ఇస్తారు. విమానం ఎగిరే కృత్రిమ వాతావరణాన్ని సృష్టించే సిమ్యులేటర్లు ఎయిర్ క్రాఫ్ట్‌ను గాలిలో నడిపిన అనుభూతినిస్తాయి. కాక్ పిట్‌లో కూర్చుని బయటి నుంచి శిక్షకులు ఇచ్చే సూచనల ప్రకారం ఎలక్ట్రానిక్ వ్యవస్థను నియంత్రించాల్సి ఉంటుంది. విమానం టేకాఫ్, ల్యాండింగ్, తలకిందులుగా ఎగరడం లాంటి అన్ని రకాల విన్యాసాల శిక్షణ సిమ్యులేటర్ ద్వారా లభిస్తుంది. యుద్ధ విమానాల్లో ఉండే, ఎలక్ట్రానిక్, ఆటోమేటిక్ నియంత్రణ వ్యవస్థలన్నీ ఇందులో ఉంటాయి. ఎదురుగా అర్ధ చంద్రాకారంలో ఉండే స్క్రీన్ పైన ఫైటర్ జెట్ కదులుతున్న దృశ్యాలు ఆవిష్కతమవుతుంటాయి. యాక్సియల్ ఏరో సంస్థ ఈ సిమ్యులేటర్ల తయారీకి అన్ని అనుమతులు సాధించి వాణిజ్య ఉత్పత్తి మొదలు పెట్టింది. వచ్చే మూడేండ్లలో ఐదు సిమ్యులేటర్లను సరఫరా చేయడానికి రక్షణ మంత్రిత్వ శాఖ నెలకొల్పిన ఇన్నోవేషన్స్ ఫర్ డిఫెన్స్ ఎక్స్ లెన్స్‌తో భారీ ఒప్పందాలు కుదుర్చుకుంది. ప్రస్తుతం మన ఎయిర్ ఫోర్స్ దిగుమతి చేసుకుంటున్న ఒక్కో ఫైటర్ జెట్ సిమ్యులేటర్ వ్యయం రూ.50 కోట్ల వరకు ఉండగా, యాక్సియల్ ఏరో రూ.25-30 కోట్లకే అందజేయనుంది. టీ-వర్క్స్‌లో పరిశోధనలు సాగిస్తున్న ఈ సంస్థ ఎయిర్ ఫోర్స్, నేవీ అవసరాలకు తగిన విధంగా ఫ్లైట్ సిమ్యులేటర్లను తయారు చేయడానికి సర్వం సిద్ధం చేసుకుంది. టీ-వర్క్స్‌ను సందర్శించిన ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పరిశోధనల పురోగతిని పరిశీలించి, ఇంజనీర్లతో సమీక్ష నిర్వహించారు. తక్కువ సమయంలో క్లిష్టమైన పరిశోధనలను పూర్తి చేసి ఆర్డర్లు సాధించినందుకు ప్రత్యకంగా ప్రశంసించారు.

బాధితులకు బాసటగా ఇందిరమ్మ ఇళ్ల 'కాల్ సెంటర్'

- పంచాయితీ కార్యదర్శి సస్పెన్షన్, మరొకరిపై విచారణ
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నిరుపేదల జీవితాల్లో వెలుగులు నింపే ఇందిరమ్మ ఇళ్ల విషయంలో ఎలాంటి అవినీతి, అక్రమాలకు తావులేకుండా రాష్ట్ర ప్రభుత్వం తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నదని గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చెప్పారు. కాల్ సెంటర్ బాధితులకు బాసటగా నిలుస్తున్నదని గురువారం మంత్రి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఏ చిన్న సమస్య వచ్చినా సంకోచించకుండా లబ్దిదారులు ఈ నెంబర్ 1800 599 5991కు ఫిర్యాదు చేస్తున్నారని తెలిపారు. ఫిర్యాదు అందిన 24 గంటల్లోనే అధికారులు రంగంలోకి దిగి తక్షణ చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల బిల్లుల మంజూరులో లంచాలు అడుగుతున్న అధికారులపై కఠినంగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, చెల్లింపుల విషయంలో అవినీతికి పాల్పడితే ఎంతటి వారినైనా ఉపేక్షించబోమని హెచ్చరించారు. పేదల నుంచి పైసా వసూలు చేసిన సహించబోమని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల నుంచి లంచం డిమాండ్ చేసిన సంగారెడ్డి జిల్లాలోని పంచాయితీ కార్యదర్శిని సస్పెండ్ చేయాలని జిల్లా కలెక్టర్‌ను మంత్రి ఆదేశించారు. రంగారెడ్డి జిల్లా మాజిద్‌పూర్ గ్రామ కార్యదర్శిపై లోతైన విచారణకు ఆదేశించామని తెలిపారు.

జూనియర్ కాలేజీలకు 10 రోజులు దసరా సెలవులివ్వాలి

- ఇంటర్ బోర్డు కార్యదర్శికి టిపిటిఎల్ఎఫ్ వినతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని జూనియర్ కాలేజీలకు పది రోజులపాటు దసరా సెలవులివ్వాలని తెలంగాణ ప్రయివేట్ టీచర్లు, లెక్చరర్ల ఫెడరేషన్ (టిపిటిఎల్ఎఫ్) రాష్ట్ర కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు ఇంటర్ బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్యకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎ విజయ్‌కుమార్, ఉపాధ్యక్షులు కె విజయ్, డివైఎఫ్ఐ హైదరాబాద్ ఉపాధ్యక్షులు రాజన్న వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలోనే పెద్ద పండుగ దసరా అని తెలిపారు. బతుకమ్మ సంబరాలు కూడా తొమ్మిది రోజులు ప్రజలు ఘనంగా జరుపుతారని పేర్కొన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని పాఠశాలలకు దాదాపు 15 రోజుల వరకు సెలవులు ప్రకటిస్తారని గుర్తు చేశారు. చదువులే కాకుండా ఆటపాటలు, సాంస్కృతిక కార్యక్రమాలు కూడా జీవితంలో భాగంగా ఉంటాయని వివరించారు. మానవ వికాసానికి అవి తోడ్పాటునిస్తాయని తెలిపారు. ఇంటర్ విద్యార్థులకు, అధ్యాపకులకు కూడా 10 రోజులకు పైగా దసరా సెలవులను ప్రకటించాలని డిమాండ్ చేశారు. పరిపరిశీలిస్తామంటూ కార్యదర్శి హామీ ఇచ్చారని తెలిపారు.

FORM No.
[See Regulation 33(2)]
By Regd. A/D, Dasti failing which by Publication
OFFICE OF THE RECOVERY OFFICER - I/II
DEBTS RECOVERY TRIBUNAL HYDERABAD (DRT 2)
1st Floor, Triveni Complex, Abids, Hyderabad 500001
NOTICE FOR SETTLING A SALE PROCLAMATION UNDER RULE 53 OF THE SECOND SCHEDULE TO THE INCOME TAX ACT, 1961 READ WITH THE RECOVERY OF DEBTS & BANKRUPTCY ACT, 1993
Rc/11/2024 **04.09.2025**
Union Bank of India"
Versus
Nutanapati Pushpalatha And Others
To,
(CH1) Union Bank of India (Formely Corporation Bank)
Branch Office At 4/659, Chintalarayungudi Veedhi, Tadipatri, Ananthapur, Andhra Pradesh-515411.
Rep. By Its Authorized Officer.
(CD 1) Nutanapati Pushpalatha,
W/o Damodara Prasad, R/o.3-6-497, Flat No.304, Saikrupa Apartments, Himayat nagar, Hyderabad, Telangana-500029.
(CD 2) Nutanapati Deepa,
W/o N. Chithambar, R/o. 11-512, Aravind Nagar, Narpala Village, Near Shepherd School, Anantapur, Andhra Pradesh-515001.
Also At:
Door No.6-5-486, Sri Nilayam, Justice M Ranga Reddy House,1st Floor, Near Ram Nagar bridge, Anantapur-515004.
(CD 3) Malapati Hymavathi,
W/o Mr. M. Bhaskar Naidu, R/o.15/229, Kamala Nagar, Anantapur-515001, Andhra Pradesh.
Whereas you the **NUTANAPATI PUSHPALATHA And others** was ordered by the Presiding Officer of **DEBTS RECOVERY TRIBUNAL HYDERABAD (DRT 2)** who had issued the Recovery Certificate dated **10/01/2024** in **OA/635/2023** to pay to the Applicant Bank(s)/Financial Institutions (s) Name of Applicant, the sum of **Rs.55,39,219/- (Rupees Fifty Five Lakhs Thirty Nine Thousand Two hundred and Nineteen Only)** along with pendentellite and future interest @ **11.75%** Simple Interest Yearly **w.e.f 06/07/2023** till realization and costs of **Rs.1,54,000 (Rupees One Lakh Fifty Four Thousands Only),** and whereas the said has not been paid, the undersigned has ordered the sale of under mentioned immovable/Immovable property.
2. You are hereby informed that the **16/10/2025 at 10.30 A.M**. has been fixed for drawing up the proclamation of sale and setting the terms thereof. You are requested to bring to the notice of the undersigned any encumbrances, charges, claims or liabilities attached to the said properties or any portion thereof.
Specification of property
SCHEDULE-B Property
(As Per Deed of MODT No.838/2016) (Property belong to Defendant No.1)
All that Property in Anantapuramu RD, SRD of Singanamala, Chamaluru Village, within Chamaluru Panchayat Limits, S.No.202-B2, A.C.19.28, out of this A/C.9.64, out of this A/C.5.64 out of this A/C.0.75 **(covered by regd. Document No.8861 of 2015 in SRO Anantapuramu)** and bounded by: East: Land belongs to Venkatarami Reddy, West: Land belongs to Fakruddin, North: Land belongs to Sujatha, South: Land belongs to Ramulamma, Total=75 cents.
Given under my hand and the seal of the Tribunal, on this date:04/09/2025.
Recovery Officer,
DEBTS RECOVERY TRIBUNAL HYDERABAD (DRT 2).

అక్టోబర్ 5 నుంచి ఎప్‌సెట్ బైసిపి కౌన్సెలింగ్

- ఏడు నుంచి ధ్రువపత్రాల పరిశీలన
- 10 వరకు వెబ్‌ఆప్షన్ల నమోదుకు అవకాశం
- 13న తొలివిడత సీట్ల కేటాయింపు
- షెడ్యూల్ విడుదల

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో 2025-26 విద్యాసంవత్సరానికి సంబంధించి బి ఫార్మసీ, ఫార్మా-డీ, బయోటెక్నాలజీ, బయోమెడికల్ ఇంజినీరింగ్, ఫార్మాసూటికల్ సైన్స్ కోర్సుల్లో ప్రవేశాల కోసం ఎప్‌సెట్ బైసిపి విద్యార్థులకు వచ్చేనెల ఐదో తేదీ నుంచి కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభం కానుంది. ఈ మేరకు సాంకేతిక విద్యాశాఖ కమిషనర్, ఎప్‌సెట్ ప్రవేశాల కన్వీనర్ శ్రీదేవసేన గురువారం షెడ్యూల్‌ను విడుదల చేశారు. వచ్చేనెల ఐదు నుంచి ఎనిమిది వరకు ఆన్‌లైన్‌లో ప్రాథమిక సమాచారం అందుబాటులో ఉంటుందనీ, ప్రాసెసింగ్ ఫీజు చెల్లించాలనీ, హెల్ప్‌లైన్ సెంటర్లలో ధ్రువపత్రాల పరిశీలనకు స్లాట్ బుకింగ్ చేసుకోవాలని సూచించారు. అదేనెల ఏడు నుంచి తొమ్మిది వరకు ధ్రువపత్రాల పరిశీలన ఉంటుందని తెలిపారు. అదేనెల ఎనిమిది నుంచి పదో తేదీ వరకు వెబ్‌ఆప్షన్ల నమోదుకు అవకాశముంటుందని వివరించారు. వచ్చేనెల 13న ఎప్‌సెట్ బైసిపి అభ్యర్థులకు తొలివిడత కౌన్సెలింగ్ ద్వారా సీట్లు కేటాయిస్తామని పేర్కొన్నారు. అదేనెల 13, 14 తేదీల్లో ట్యూషన్ ఫీజు చెల్లించడంతోపాటు, ఆన్‌లైన్ ద్వారా సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలని సూచించారు.

16 నుంచి తుదివిడత కౌన్సెలింగ్

ఎప్‌సెట్ బైసిపి అభ్యర్థులకు తుదివిడత కౌన్సెలింగ్ ప్రక్రియ వచ్చేనెల 16వ తేదీ నుంచి ప్రారంభమవుతుందని శ్రీదేవసేన తెలిపారు. అదేనెల 16న ఆన్‌లైన్‌లో ప్రాథమిక సమాచారం అందుబాటులో ఉంటుందనీ, ప్రాసెసింగ్ ఫీజు చెల్లించాలనీ, హెల్ప్‌లైన్ సెంటర్లలో ధ్రువపత్రాల పరిశీలనకు వెళ్లేందుకు స్లాట్ బుకింగ్ చేసుకోవాలని సూచించారు. 17న ధ్రువపత్రాల పరిశీలన జరుగుతుందని వివరించారు. 17, 18 తేదీల్లో వెబ్‌ఆప్షన్లు నమోదు చేయాలని కోరారు. మొదటి విడతలో ఇచ్చిన వెబ్‌ఆప్షన్లను పరిగణనలోకి తీసుకోబోమని స్పష్టం చేశారు. 21న తుదివిడత కౌన్సెలింగ్‌లో సీట్లు కేటాయిస్తామని తెలిపారు. అదేనెల 21, 22 తేదీల్లో ట్యూషన్ ఫీజు చెల్లించాలనీ, వెబ్‌సైట్ ద్వారా సెల్ఫ్‌రిపోర్టింగ్ చేయాలని కోరారు. అదేనెల 22, 23 తేదీల్లో కేటాయించిన కాలేజీల్లో అభ్యర్థులు రిపోర్టు చేయాలని సూచించారు. ఒరిజినల్ టీసీతోపాటు విద్యకు సంబంధించిన జిరాక్స్ ప్రతులను అందజేయాలని తెలిపారు. ప్రయివేటు ఇంజినీరింగ్, ఫార్మసీ కాలేజీల్లో ఎప్‌సెట్ బైపీసీ అభ్యర్థుల స్పాట్ అడ్మిషన్లకు సంబంధించిన మార్గదర్శకాలను వచ్చేనెల 23న విడుదల చేస్తామని శ్రీదేవసేన తెలిపారు. ఇతర వివరాలు, సమాచారం కోసం https://tgeapcetb.nic.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరారు.

నిధులు ఇవ్వడంలో రాష్ట్రంపై కేంద్రం వివక్ష

- బిసి రిజర్వేషన్లకు బిజెపి వ్యతిరేకం : జాన్‌వెస్లీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రానికి రావాల్సిన నిధులు, రైతులకు యూరియా ఇవ్వడంలో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం వివక్ష చూపుతోందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ అన్నారు. వనపర్తి జిల్లా మదనాపురం మండలంలోని దుప్పల్లి గ్రామంలో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం శాసనసభలో ఆమోదించి పంపిన బిసి రిజర్వేషన్ల బిల్లు, ఆర్డినెన్స్‌పై కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలపడంలేదని విమర్శించారు. రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుకు బీజేపీ వ్యతిరేకంగా ఉందని చెప్పారు. కేంద్రం ప్రభుత్వం రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేస్తోందన్నారు. రాష్ట్రానికి రావాల్సిన నిధులు, రైతులకు కావాల్సిన యురియా ఇవ్వకుండా వివక్ష చూపిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బిసిల రిజర్వేషన్లకు వ్యతిరేకంగా బిజెపి వ్యవహరిస్తోందని విమర్శించారు. ఉద్యోగాలు భర్తీ చేస్తామని తుంగలో తొక్కిందన్నారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసిల సంక్షేమ పథకాలను కూడా నిర్వీర్యం చేసిందని చెప్పారు. రాష్ట్రానికి రావాల్సిన నీటి వాటా, బడ్జెట్‌లో నిదులు, సంక్షేమ పథకాల విషయంపై ఐక్య ఉద్యమాలు చేస్తామని తెలిపారు.

రాష్ట్రంలో 28 లక్షల కుటుంబాలకుపైగా ఇండ్లు లేని పేదలు ఉన్నారని తెలిపారు. వీళ్లందరికీ గతంలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇస్తామని చెప్పిన బిఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా అమలు చేయలేదని విమర్శించారు. సమావేశంలో సిపిఎం రాష్ట్ర నాయకులు ఆర్ వెంకట్‌రాములు, డిజి నర్సింహారావు, జిల్లా కార్యదర్శి పుట్టా ఆంజనేయులు, నాయకులు ఎస్ రాజు, మేకల ఆంజనేయులు, అజయ్ తదితరులు ఉన్నారు.

'సీడ్‌బౌల్ ఆఫ్ ఇండియా' గా తెలంగాణ

- రాష్ట్రం నుంచి దేశ విదేశాలకు నాణ్యమైన విత్తనాల ఎగుమతి
- సీడ్మెన్ అసోసియేషన్ 30వ వార్షికోత్సవంలో మంత్రి తుమ్మల

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దేశవ్యాప్తంగా తెలంగాణ రాష్ట్రం సీడ్ బౌల్ ఆఫ్ ఇండియా'గా గుర్తింపు పొందిందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చెప్పారు. తెలంగాణ రాష్ట్రం భవిష్యత్తులో 'గ్లోబల్ సీడ్ క్యాపిటల్'గా అవతరించబోతోందని తెలిపారు. గురువారం సీడ్మెన్ అసోసియేషన్ 30వ వార్షికోత్సవ కార్యక్రమంలో తుమ్మల మాట్లాడుతూ 25 ఏళ్లుగా సీడ్మెన్ అసోసియేషన్ రైతులు, శాస్త్రవేత్తలు, పరిశ్రమలు, ప్రభుత్వాల మధ్య బలమైన వారధిగా నిలిచిందని అభినందించారు. నాణ్యమైన విత్తనాల తయారీలో తెలంగాణ దేశంలోనే అగ్రస్థానంలో ఉందని చెప్పారు. ప్రస్తుతం 3.5 లక్షల మంది రైతులు... ఎనిమిది లక్షల ఎకరాల్లో విత్తన ఉత్పత్తి సాగు చేస్తున్నారని తెలిపారు. ప్రతి ఏటా రాష్ట్రం నుంచి రూ.2వేల కోట్ల విలువైన లక్ష టన్నుల విత్తనాలను ఎగుమతి అవుతున్నాయని వివరించారు. ప్రభుత్వం తీసుకుంటున్న కఠిన నిర్ణయాలతో అంతర్జాతీయ మార్కెట్‌లో తెలంగాణ విత్తనాలకు ప్రత్యేక గుర్తింపు ఉందని పేర్కొన్నారు. రైతుల కష్టం, క్రమశిక్షణ, అవగాహనతో ఈ విజయం సాధ్యమవుతోందని తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో 1.3 లక్షల ఎకరాల్లో సాగుతున్న ఆయిల్‌ఫామ్, భవిష్యత్తులో మరింత విస్తరించి రాష్ట్రాభివృద్ధికి గేమ్ ఛేంజర్‌గా మారనుందని స్పష్టం చేశారు. నిజాయితీగా పని చేసే విత్తన కంపెనీలను ప్రోత్సహించడం, నకిలీ విత్తనాల నుంచి రైతులను రక్షించడం రెండూ ముఖ్యమని చెప్పారు. ఈ లక్ష్యాలను సాధించేందుకు తెలంగాణ విత్తన చట్టానికి సవరణలను తీసుకొస్తున్నామని, ప్రస్తుతం అవి ముసాయిదా దశలో ఉన్నాయని తెలిపారు. సీడ్ ఇండస్ట్రీ అభివృద్ధికి అవసరమైన అన్ని సహకారాలను అందించేందుకు సిఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన పేర్కొన్నారు. విత్తనాలను సరఫరా చేయడమే కాకుండా జ్ఞానాన్ని పంచే కేంద్రంగా కూడా తెలంగాణ నిలిచిందన్నారు. 1995 నుంచి రైతులు, కంపెనీలు, శాస్త్రవేత్తలు, ప్రభుత్వాల మధ్య అనుసంధానంగా పని చేస్తూ విత్తన రంగానికి విశేష సేవలందించినందుకు సీడ్మెన్ అసోసియేషన్‌ను ఈ సందర్భంగా మంత్రి అభినందించారు. కార్యక్రమంలో భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సెర్ఫ్ ఇసిఒ విజయ్‌కుమార్, వ్యవసాయ శాఖ సెక్రటరీ రఘునందన్ రావు, డైరెక్టర్ గోపి, సీడ్‌మెన్ అసోషియేషన్ సభ్యులు, వ్యవసాయ శాఖ అడిషనల్ డైరెక్టర్, విత్తన కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

నేచురల్ ఫార్మింగ్‌కు తెలంగాణలో అధిక ప్రాధాన్యం : మంత్రి తుమ్మల

తెలంగాణ రాష్ట్రంలో ప్రకతి వ్యవసాయాన్ని పెద్ద ఎత్తున ప్రోత్సహించే విదంగా ప్రణాళికను రూపొందిస్తున్నామని వ్యవసాయ శాఖామంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. గురువారం సెక్రటేరియట్‌లో ఎపిసిఎన్‌ఎఫ్ ప్రతినిధులు విజయ్ కుమార్, తదితరులు ప్రకృతి వ్యవసాయ విధనాలు, వివరించారు. వ్యవసాయ కార్యదర్శి రఘునందన్, వ్యవసాయ శాఖ సంచాలకులు డా గోపి ప్రకృతి వ్యవసాయం ప్రగతిని వివరించారు. ఇప్పటికే రాష్ట్రంలో 489 క్లస్టర్లు ఏర్పాటు చేసి 61,125 రైతులను ఎంపిక చేసినట్లు (50 హెక్టార్లు ప్రతి క్లస్టర్లు), దీనికి గాను కేంద్ర ప్రభుత్వ నిధులతో పాటు రాష్ట్ర ప్రభుత్వం 42.07 కోట్లు కేటాయించిందని రిసోర్స్ పర్సన్ లకు వాలంతరి ఆధ్వర్యంలో శిక్షణను పూర్తి చేశామని తెలియజేశారు. ఎపి సిఎన్‌ఎఫ్ ప్రతినిధులు సూచించిన విధంగా ప్రకృతి వ్యవసాయాన్ని రాష్ట్రంలో ముందుకు తీసుకువెళ్తామని తెలియజేసారు. తుమ్మల మాట్లాడుతూ ఇప్పటిదాకా రైతులలో ప్రకృతి వ్యవసాయంలో దిగుబడులు తగ్గుతాయనేది అపోహ మాత్రమే అన్నారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా ఆరోగ్యకర ఉత్పత్తులు తీసి మార్కెటింగ్ అవకాశాలను పెంచుకొని అవకాశం కలదని వర్షాధార ప్రాంతాలలో కూడా మూడు పంటలు తీసే అవకాశం కలదని, అలాగే కలుపు, చీడపీడల సమస్య కూడా గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు.

నగరంలో సైబర్ పవర్ పిసి ఎక్స్‌పీరియన్స్ జోన్ ఏర్పాటు

హైదరాబాద్ : అమెరికా అధారిత గేమింగ్, తయారీదారు సైబర్ పవర్ పిసి హైదరాబాద్‌లో తన ఎక్స్‌పీరియన్స్ జోన్‌ను విశాల్ పెరిఫెరల్స్‌లో ప్రారంభించింది. సైబర్ పవర్ పిసి ఇండియా, విశాల్ పెరిఫెరల్స్ భాగస్వామ్యంలో సికింద్రాబాద్‌లోని సిటిసిలో ఏర్పాటు చేసిన ఈ సెంటర్‌లో గేమర్‌లు, స్ట్రీమర్ లు, కంటెంట్ సృష్టికర్తలు, ఔత్సాహికులు అధిక పనితీరు గల హార్డ్ వేర్ ఉత్పత్తులను పొందవచ్చని సైబర్ పవర్ పిసి ఇండియా చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ విశాల్ పరేఖ్, విశాల్ పెరిఫెరల్స్ డైరెక్టర్ వికాస్ హిసారియా తెలిపారు. ఇక్కడ స్టోర్‌ను ఏర్పాటు చేయడం పట్ల వారు ఆనందం వ్యక్తం చేశారు.

హృదయ వ్యాధుల పట్ల నిరంతరం అప్రమత్తత అవసరం

- డాక్టర్ బి రాజేష్ సూచన

ప్రజాశక్తి - హైదరాబాద్

దేశంలో గుండె సంబంధిత వ్యాధులు పెరుగుతున్నాయని.. వీటిపై నిరంతరం జాగ్రత్త వహించాలని ప్రముఖ గుండె వైద్య నిపుణులు, టచ్ హాస్పిటల్స్ కార్డియాలజీ డాక్టర్ బి రాజేష్ సూచించారు. ముఖ్యంగా యువతలో ఈ సమస్య ఆందోళన కలిగించే స్థాయిలో ఉందని ఆయన ఓ ప్రకటనలో ఆందోళన వ్యక్తం చేశారు. వైద్య చికిత్సలు అభివృద్ధి చెందినప్పటికీ, గుండెను రక్షించుకోవడం వంటగది నుంచే మొదలవుతుందన్నారు. రోజువారీగా మన ప్లేట్‌లో ఉండే పండ్లు, కూరగాయలు, సంపూర్ణ ధాన్యాలు, తక్కువ కొవ్వు ప్రోటీన్లు, ఆరోగ్యకరమైన కొవ్వులు ఇవే గుండె ఆరోగ్యాన్ని కాపాడుతాయా లేదా నిశ్శబ్ద ఒత్తిడిలో పెడతాయా అనే దానిని నిర్ణయిస్తాయన్నారు. మంచి ఆరోగ్యానికి జీవనశైలి మార్పులు అవసరమని చెప్పారు. రోగులకు స్థానిక ఆహార పదార్థాలు మునగ ఆకులు, కరివేపాకు, సజ్జ, రాగి, తాజా చేపలు వీటిని డాష్ డైట్, మెడిటరేనియన్ డైట్ కలిపి తీసుకోవాలని డాక్టర్ రాజేష్ సూచించారు.

త్రిబుల్ ఆర్ అలైన్‌మెంట్ వెంటనే మార్చాలి

- పెద్దల కోసం పేద రైతులను బలి చేయొద్దు
- 27న సంగారెడ్డి కలెక్టరేట్ వద్ద ధర్నాను జయప్రదం చేయండి : జయరాజు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

త్రిబుల్ ఆర్ అలైన్‌మెంట్ వెంటనే మార్చి రైతులకు న్యాయం చేయాలని సిపిఎం సంగారెడ్డి జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం సిపిఎం ఆధ్వర్యంలో కొండాపూర్ మండలం మారేపల్లి, రాంపూర్ తండా, శివ్వన్న గూడెం గ్రామాల్లో త్రిబుల్ ఆర్‌లో భూములు కోల్పోతున్న రైతులతో సమావేశమయ్యారు.

పచ్చని పంటలు పండే ఈ చేను వదిలి మేము ఎలా బతకాలని సిపిఎం నాయకులతో రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. తమ జీవనాధారమయిన పొలాలు విడిచి తాము ఉండలేమని, తమ ప్రాణాలైనా వదులుతాము కానీ భూములు వదులుకోబోమని రైతులు తెలిపారు. ఈ

నిరసన తెలుపుతున్న జయరాజు తదితరులు

ప్రభుత్వం, అధికారులు ప్రయివేటు వ్యక్తుల వెంచర్లను కాపాడేందుకు తీవ్రమైన ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. త్రిబుల్ ఆర్ అలైన్‌మెంట్ మార్చాలని, తప్పనిసరి పరిస్థితుల్లో భూములు తీసుకోవాల్సి వస్తే భూమికి బదులు భూమి కొనివ్వాలని, బహిరంగ మార్కెట్ ప్రకారం ధర చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 27న సంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద త్రిబుల్ ఆర్ బాధితుల పక్షాన సిపిఎం చేపట్టనున్న ధర్నాకు రైతులు స్వచ్ఛందంగా తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా జయరాజు మాట్లాడుతూ.. త్రిబుల్ ఆర్‌లో పెద్దల భూముల కోసం పేద రైతులను బలి చేయొద్దని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. రైతులు ధైర్యంగా ఉండాలని, మీకు అండగా సిపిఎం ఉంటుందని తెలిపారు. పెద్దల భూములు కాపాడటానికి మండలంలో అత్యధికంగా బడుగు, బలహీన వర్గాల, పేదల భూములే పోతున్నాయని అన్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అతిమేల మాణిక్, జిల్లా కమిటీ సభ్యులు కృష్ణ, కొండాపూర్ మండల కార్యదర్శి రాజయ్య, రైతులు తదితరులు పాల్గొన్నారు.

కొంపెల్లి వెంకట్ గౌడ్ మరణం పట్ల కెసిఆర్ సంతాపం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ సామాజిక చారిత్రక సాహితీవేత్త, ప్రముఖ రచయిత కొంపెల్లి వెంకట్ గౌడ్ మరణం పట్ల మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ సంతాపం ప్రకటించారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రొఫెసర్ జయశంకర్ గారితో సంభాషణ–వొడువని ముచ్చట పుస్తకం ద్వారా తెలంగాణ రాష్ట్ర సాధన కోసం అనుసరించాల్సిన రాజకీయ భావజాలాన్ని వ్యాప్తిచేసిన ఉద్యమ రచయిత కొంపెల్లి అని కొనియాడారు. సర్దార్ సర్వాయి పాపన్న చరిత్రను రికార్డు చేసి వెలుగులోకి తెచ్చి, బీసీల రాజకీయ చైతన్యం కోసం పాటుపడిన ఘనత కొంపెల్లిదేననీ, ఆయనతో తనకున్న అనుబంధాన్ని కేసీఆర్ గుర్తు చేసుకున్నారు. వెంకట్ గౌడ్ అకాల మరణం తెలంగాణ సాహితీ లోకానికి తీరనిలోటని విచారం వ్యక్తం చేశారు. వెంకట్ గౌడ్ కుటుంబ సభ్యులు, మిత్రులకు కెసిఆర్ తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

బిఎస్‌ఎ మోటార్ సైకిల్స్ ధరలు తగ్గింపు

పూణె : బిఎస్ఎ మోటార్ సైకిల్స్ తన గోల్డ్‌స్టార్ 650 ధరలను తగ్గించినట్లు తెలిపింది. ఇటీవల తగ్గించిన జిఎస్‌టి సందర్భంగా ఈ పండుగ సీజన్‌లో బిఎస్ఎ గోల్డ్ స్టార్ హైల్యాండ్ గ్రీన్ ధరను రూ.3,09,990కు, సిగ్నియా రెడ్ ధరను రూ.3,09,990కు కోత పెట్టినట్లు పేర్కొంది. ఇతర మోడళ్లపై కూడా ధరలను తగ్గించినట్లు వెల్లడించింది. జీరో డౌన్ పేమెంట్‌తో పాటు 5.99 శాతం వడ్డీ రేటుతోనే తమ వాహనాలను సొంతం చేసుకోవచ్చని పేర్కొంది.

నవంబర్‌లో యూనిఫాం మానుఫ్యాక్చరర్స్ ఫెయిర్

ముంబయి : ఈ ఏడాది నవంబర్‌లో 26 నుంచి 28 వరకు ముంబయిలోని గోరెగావ్‌లో అంతర్జాతీయ యూనిఫాం మానుఫ్యాక్చరర్స్ ఫెయిర్‌ను నిర్వహించనున్నామని సోలాపూర్ గార్మెంట్ మానుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ (ఎస్‌జిఎంఎ) వెల్లడించింది. ఈ మూడు రోజుల ఫెయిర్ 150కి పైగా జాతీయ బ్రాండ్‌లను ఒకచోట చేర్చనున్నట్లు తెలిపింది. 30,000కు పైగా యూనిఫాం డిజైన్లు, 15,000 ఫ్యాబ్రిక్ డిజైన్లను ప్రదర్శించనున్నట్లు ఆ వర్గాలు వెల్లడించాయి.

రామ్‌రాజ్ కాటన్ నుంచి గ్రాండ్ ఫెస్టివ్ కలెక్షన్

హైదరాబాద్: సీజన్ దగ్గరపడుతున్న తరుణంలో రామరాజ్ కాటన్ కొత్త 'గ్రాండ్ ఫెస్టివ్ కలెక్షన్'ను ఆవిష్కరించినట్లు ఆ సంస్థ చైర్మన్ కె.ఆర్. నాగరాజన్ తెలిపారు. దశాబ్దాలుగా, రామ్‌రాజ్ కాటన్ ఆధునిక అవసరాలకు అనుగుణంగా స్వదేశీ వారసత్వాన్ని గౌరవిస్తోం దని అన్నారు. కేవలం వస్త్రధారణగానే కాకుండా చక్కదనం, వారసత్వం మరియు ఆనందకరమైన వేడుకల ప్రతీకగా మారతయన్నారు.

యాదగిరిగుట్టలో దారుణం

- ముగ్గురు బాలికలపై ముగ్గురు యువకుల లైంగికదాడి
- నిందితులతోపాటు లాడ్జి యజమాని అరెస్ట్
- ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

యాదగిరిగుట్టలో అమానుష ఘటన జరిగింది. పాఠశాలకు వెళ్లకుండా దైవదర్శనానికి బయలుదేరిన బాలికలను బస్టాండ్‌లో పరిచయమైన యువకులు మాయమాటలతో నమ్మించి తీసుకెళ్లి అఘాయిత్యం చేశారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అల్వాల్‌కు చెందిన ముగ్గురు బాలికలను ముగ్గురు యువకులు యాదగిరిగుట్టకు తీసుకెళ్లి అక్కడ ఓ లాడ్జిలో లైంగికదాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో నిందితులతో పాటు లాడ్జి యజమానిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. అల్వాల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అల్వాల్‌లో తొమ్మిదో తరగతి చదువుతున్న ముగ్గురు బాలికలు ఈ నెల 20న స్కూల్‌లో బతుకమ్మ ఉత్సవాలు ఉన్నాయని ఇళ్ల నుంచి బయలుదేరి వెళ్లారు. అయితే, బాలికలు పాఠశాలకు రాకపోవడంతో ఓ టీచర్ తల్లిదండ్రులకు ఫోన్ చేసి చెప్పారు. దాంతో ఆందోళనకు గురైన వారు బాలికల స్నేహితుల ఇళ్లల్లో వెతికినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. మిస్సింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

ఇదిలా ఉండగా, స్కూల్‌కని బయల్దేరిన ముగ్గురు బాలికలు యాదగిరిగుట్ట వెళ్లాలని తార్నాకకు చేరుకున్నారు. అక్కడ మాణికేశ్వరి నగర్‌కు చెందిన మధు, వారాసిగూడకు చెందిన నీరజ్, మల్లీశ్వరినగర్‌కు చెందిన అరవింద్ బాలికలను పరిచయం చేసుకున్నారు. వారు యాదగిరిగుట్టకు వెళ్తున్నట్టు తెలుసుకుని.. తామూ అక్కడికే వెళ్తున్నామని మాయమాటలు చెప్పి బాలికలను నమ్మించారు. అనంతరం ఆరుగురు కలిసి బస్సులో యాదగిరిగుట్టకు వెళ్లారు. గుట్టపై దర్శనం అనంతరం లాడ్జిలో గది అద్దెకు తీసుకున్నారు. రాత్రంతా ఆ గదిలో ముగ్గురు బాలికలపై ఆ ముగ్గురు దుండగులు లైంగికదాడి చేశారు. మరునాడు ఉదయం బాలికలను తార్నాకలో వదిలేసి వెళ్లారు. ఇళ్లకు చేరుకున్న బాలికలను వారి తల్లిదండ్రులు ఎక్కడికి వెళ్లారని నిలదీసేసరికి.. జరిగిన విషయమంతా చెప్పారు. పోలీసులు ముగ్గురు యవకులను అరెస్టు చేసి వారిపైన పోక్సో కేసు నమోదు చేశారు. యువకుల వెంట బాలికలు ఉన్నారని తెలిసి కూడా లాడ్జిలో గదిని అద్దెకు ఇచ్చిన యజమాని సోమేశ్‌ను కూడా అరెస్టు చేసి అందరినీ రిమాండ్‌కు తరలించారు.

'కడారి'కి కన్నీటి వీడ్కోలు

- ప్రజలు, విప్లవ అభిమానుల జోహార్లతో సాగిన అంతిమయాత్ర
- 'బూటకపు ఎన్‌కౌంటరే' అంటూ నేతల తీవ్ర ఆరోపణలు

కడారిపై జగిరిన ఎన్‌కౌంటర్ గురించి మాట్లాడుతున్న నాయకులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నాలుగు దశాబ్దాలపాటు ప్రజా ఉద్యమాలతో మమేకమై, మావోయిస్టు కేంద్ర కమిటీలో ఉన్నతస్థాయికి ఎదిగిన 'కడారి సత్యనారాయణరెడ్డి' అలియాస్ 'కడారి'కి కన్నీటి వీడ్కోలు పలికారు. అంతిమయాత్ర జనసందోహం, నినాదాల నడుమ ఎర్రజెండాల రెపరెపలు.. అశ్రునయనాల మధ్య గురువారం ముగిసింది. కడారి భౌతికకాయాన్ని కడసారి చూసేందుకు వచ్చిన విప్లవ అభిమానులు, గ్రామస్తులతో గోపాల్‌రావుపల్లె కిక్కిరిసింది. కడారి మృతదేహం స్వగ్రామానికి చేరినప్పటి నుంచి వర్షం ఎడతెరిపి లేకుండా కురిసినా, లెక్కచేయకుండా వేలాదిమంది తరలివచ్చారు. మావోయిస్టు పార్టీ సెంట్రల్ కమిటీ సభ్యులుగా ఉన్న కడారి మరణంతో రాజన్న సిరిసిల్ల జిల్లా, తంగళ్లపల్లి మండలం గోపాల్‌రావుపల్లెలో విషాదఛాయలు అలుముకున్నాయి. ప్రజాసంఘాల నాయకులు, వివిధ రాజకీయ పార్టీల నేతలు గురువారం 'కడారి' భౌతికకాయానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ప్రజాసంఘాల నాయకులు కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర ఆరోపణలు చేశారు. పౌర హక్కుల సంఘం నాయకులు, గాదె ఇన్నయ్య తదితర నేతలు మాట్లాడుతూ.. కడారి సత్యనారాయణ రెడ్డిని, మరో కేంద్ర కమిటీ సభ్యుడు రాజును ఛత్తీస్‌గఢ్‌లోని అబూజ్‌మడ్ సరిహద్దుల్లో బూటకపు ఎన్‌కౌంటర్‌లో చిత్రహింసలు పెట్టి కాల్చి చంపారని ఆరోపించారు. ముమ్మాటికీ ఇది ప్రభుత్వం చేసిన హత్య అన్నారు. విరసం కార్యదర్శి పాణి, అమరవీరుల బంధుమిత్రుల కమిటీ నాయకురాలు పద్మకుమారి తదితరులు పాల్గొన్నారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు తోట ఆగయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షులు జలగం ప్రవీణ్ కుమార్, సిపిఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు సహా పలువురు రాజకీయ పార్టీల నేతలు కూడా కడారి భౌతికకాయానికి నివాళులు అర్పించారు.

మద్యం దుకాణాలకు నోటిఫికేషన్ జారీ

- ఈ నెల 26 నుంచి అక్టోబరు 18 వరకు స్వీకరణ
- అక్టోబర్ 23న లాటరీ పద్ధతిలో ఎంపిక

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మద్యం దుకాణాల కేటాయింపు, షెడ్యూల్‌కు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. తెలంగాణ వ్యాప్తంగా 2,620 మద్యం దుకాణాలకు శుక్రవారం నుంచి అక్టోబర్ 18 వరకు దరఖాస్తులను స్వీకరించనున్నారు. అక్టోబర్ 23న లాటరీ పద్ధతిలో దుకాణాలు కేటాయించనున్నారు. రెండేళ్ల కాలానికి (2025 డిసెంబర్ 1 నుంచి 2027 నవంబర్ 30 వరకు) అనుమతులతో ఎక్సైజ్ శాఖ కొత్త లైసెన్సులు జారీ చేయనుంది. కొత్త మద్యం దుకాణాలకు దరఖాస్తు రుసుము రూ.మూడు లక్షలుగా నిర్ధారించారు. ఎక్సైజ్ చట్టం 1968 ప్రకారం శిక్ష పడిన వారు, ప్రభుత్వానికి బకాయిలు పడి సక్రమంగా చెల్లింపులు చేయనివారు దుకాణాలు పొందేందుకు అనర్హులు. దుకాణాల కేటాయింపులో గౌడ్ సామాజిక వర్గానికి 15 శాతం, ఎస్‌సిలకు పది శాతం, ఎస్‌టిలకు ఐదు శాతం రిజర్వేషన్లు కల్పించనున్నారు. రిజర్వేషన్ కల్పించిన దుకాణాల్లో దరఖాస్తు చేసుకునేవారు కుల ధృవీకరణ పత్రంతో పాటు రూ. మూడు లక్షల డిడి, లేదా చలాన్ జతపరుచాల్సి ఉంటుంది. కుల ధృవీకరణ పత్రం సకాలంలో అందని వారు, నవంబరు 15 తేదీ వరకు అందజేయాల్సి ఉంటుంది. అయితే దరఖాస్తుతో పాటు అండర్ టేకింగ్ పత్రం జాత పర్చాల్సి ఉంటుంది. డిడిలు, లేదా చలాన్లను డిపిఒ (జిల్లా ప్రొహిబిషనర్ అండ్ ఎక్సైజ్ అధికారి) పేరున తీయాల్సి ఉంటుంది. దరఖాస్తు ఫారాలను డిపిఒ, డిప్యూటి కమిషనర్ లేదా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కమిషనర్ కార్యాలయంలో అందజేయాడానికి అవకాశం కల్పించారు.

'స్వప్న' చూపిన మానవత్వం

- ముగ్గురి జీవితాల్లో కొత్త వెలుగు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తన భర్త బ్రెయిన్ డెడ్ అయి తీవ్రమైన విచారంలో ఉన్న సమయంలో స్వప్న చూపించిన మానవత్వం ముగ్గురి జీవితాల్లో వెలుగు నింపింది. ఇందుకు సంబంధించిన వివరాలను రాష్ట్ర జీవన్‌దాన్ ప్రోగ్రాం నోడల్ ఆఫీసర్ ప్రొఫెసర్ శ్రీభూషణ్ రాజు గురువారం వెల్లడించారు. కరీంనగర్ జిల్లా శంకరపట్నం, మొలంగూర్, కన్నాపూర్‌కు చెందిన చిలువేరి రాజేశ్ కుమార్ (37) ప్రయివేటు ఉద్యోగి. ఈ నెల 20న ద్విచక్ర వాహనంపై వెళుతుండగా గణేశ్ నగర్ వద్ద అకస్మాత్తుగా పడిపోయారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు వెంటనే కరీంనగర్‌లోని ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. మరింత మెరుగైన వైద్యం కోసం రాజేశ్ కుమార్‌ను అక్కడ్నుంచి హైదరాబాద్ లోని ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. అత్యవసర చికిత్స అందించినప్పటికీ సెప్టెంబర్ 24న ఆయన బ్రెయిన్ డెడ్ అయ్యారు. రాజేశ్ భార్య స్వప్న అవయవాల కోసం ఎదురు చూస్తున్న రోగులకు సహాయ పడేలా తన భర్త కాలేయం, మూత్రపిండాలు, ఒక ఊపిరితిత్తి, కార్నియాలు దానం చేసేందుకు ముందుకొచ్చారు. ఆమె తీసుకున్న నిర్ణయం ఉత్తమమైందని, ప్రాణాలను నిలపడంలో స్ఫూర్తిగా నిలిచిందని శ్రీభూషణ్ రాజు అభినందించారు. రాష్ట్రంలో ఈ ఏడాది 145 మంది బ్రెయిన్ డెడ్ అయిన వారి నుంచి అవయవదానాలు జరిగినట్టు ఆయన తెలిపారు.

ఓట్ల ప్రక్షాళన..

- బీహార్ తరహాలో ఓట్లు తొలగించే ప్రయత్నం
- ముగిసిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్
- 2002, 2025 ఓటర్ జాబితాల మ్యాచింగ్‌కు ఇంటింటి సర్వే

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ రాష్ట్రంలోనూ ఓట్ల తొలగింపుకు ఎలక్షన్ కమిషన్ రంగం సిద్ధం చేసింది. బీహార్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఇటీవల ఎలక్షన్ కమిషన్ 65 లక్షల ఓట్లను తొలగించినట్టే.. తెలంగాణలోనూ ఓట్లను తొలగించే ప్రయత్నాలు మొదలు పెట్టింది. ఎలక్షన్ కమిషన్ ద్వారా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పేరిట ప్రస్తుతం తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రక్షాళన చేపట్టారు. 2002, 2025 ఓటర్ జాబితాలను మ్యాచింగ్ చేసి రెండు జాబితాల్లో ఓట్లు ఉన్న వారి వివరాలను సేకరించి నివేదిక పంపించారు. మిగిలిన ఓట్లను పరిశీలించేందుకు త్వరలోనే బిఎల్‌ఒల ద్వారా ఇంటింటి సర్వే నిర్వహించి.. వాళ్లు ఎలా ఓటు హక్కు పొందారో సంబంధిత ధ్రువీకరణ పత్రాలు స్వీకరించేందుకు సిద్ధమవుతున్నారు.

రాష్ట్రవ్యాప్తంగా వారం కిందట ఎలక్షన్ కమిషన్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఓటర్ జాబితాలను ప్రక్షాళన చేయాలని ఆదేశించింది. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పేరిట ఓటర్ జాబితాను మ్యాచింగ్ చేశారు. మొదటి దశలో మ్యాచింగ్ ప్రక్రియ బుధవారం ముగియడంతో ఆ నివేదికను అధికారులు ఎలక్షన్ కమిషన్‌కు సమర్పించారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో 30 నుంచి 40 శాతం ఓట్లు మాత్రమే మ్యాచింగ్ అయినట్టు సమాచారం. మిగిలిన ఓటర్లు స్థానికులా? కాదా? గుర్తించేందుకు బిఎల్‌ఒలు ఇంటింటి సర్వే చేయనున్నారు. ఆ సర్వేలో ఓటర్లు తమ ఓటు హక్కు ఎలా పొందారో సంబంధిత స్థానికత ధ్రువీకరణ పత్రాలు అందజేసి నిరూపించుకోవాల్సి ఉంటుంది. ఆ ప్రక్రియ దసరా పండుగ తర్వాత చేపట్టనున్నట్టు సమాచారం. బీహార్ రాష్ట్రంలో ఎలా చేశారో తెలంగాణలోనూ అదేవిధంగా చేస్తున్నట్టు సమాచారం.

2002, 2025 జాబితాలో ఓట్లు ఉంటేనే..

స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పేరిట ఎలక్షన్ కమిషన్ ఓటర్ జాబితా ప్రక్షాళన చేపట్టింది. ఎలక్షన్ కమిషన్ అందించిన 2002, 2025 ఓటర్ జాబితాల ఆధారంగా ఓటర్ల మ్యాచింగ్ చేపట్టారు. రెండు జాబితాలలో ఓటరు ఓటు హక్కు కలిగి ఉంటేనే వారు స్థానికులుగా, దేశ పౌరులుగా గుర్తించనున్నారు. 2025 ఓటర్ జాబితాలో మాత్రమే ఓటు హక్కు ఉంటే.. ఆ ఓటర్లు ఎలా ఓటు హక్కు పొందారో నిరూపించుకునేందుకు సంబంధిత ధ్రువీకరణ పత్రాలు సమర్పించాల్సి ఉంటుంది. సరైన ధ్రువీకరణ పత్రాలు, ఓటు హక్కు పొందిన ఆధారాలు చూపించకపోతే ఆ ఓటరును స్థానికేతరునిగా గుర్తించి జాబితా నుంచి తొలగిస్తామని ఓ అధికారి 'నవతెలంగాణ'కు తెలిపారు. 2002లో ఓటు హక్కు ఉండి ఇప్పుడు ఓటు హక్కు లేని వారి వివరాలను సేకరించి వారు ఎక్కడికి వెళ్లారు..? ఎక్కడ ఉన్నారు? అనే వివరాలు కూడా ఆరా తీయనున్నారు. జాబితాలో ఎవరైనా చనిపోయిన, ఇతర దేశాలకు వలస వెళ్లిన వారి ఓట్లు ఉంటే గుర్తించి తొలగించనున్నారు.

రాష్ట్రంలో 60 లక్షల ఓట్లు తొలగించే కుట్ర

రాష్ట్రంలోని 119 నియోజకవర్గాలలో ఓట్ల జాబితా ప్రక్షాళన సాగుతోంది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని 12 నియోజకవర్గాలలో ఈ ప్రక్షాళన నడుస్తోంది. 2002, 2005 ఓటర్ జాబితాల ప్రకారం ఒక్కో నియోజకవర్గంలో సుమారు 50 వేల నుంచి 60 వేల వరకు ఓట్లు మ్యాచింగ్ అయినట్టు సమాచారం. ధ్రువీకరణ పత్రాల పరిశీలన అనంతరం ప్రతి నియోజకవర్గంలోనూ 20 నుంచి 30 శాతం ఓట్లు తొలగిపోయే అవకాశమున్నది. ఉమ్మడి జిల్లాలోని ఒక్కో నియోజకవర్గంలో సుమారు 40 వేల నుంచి 60 వేల ఓట్ల వరకు అంటే 12 నియోజకవర్గాల్లో సుమారు 5 లక్షల ఓట్లు, తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 60 లక్షల ఓట్లు తొలగిపోయే అవకాశముంది.

ఎన్నికల కమిషన్ ఆదేశాలను పాటిస్తాం సబ్ కలెక్టర్ నారాయణ అమిత్

ఓటర్ జాబితా ప్రక్షాళన విషయంపై ఎన్నికల కమిషన్ ఆదేశాలను పాటిస్తాం. ప్రస్తుతం 2002, 2025 ఓటర్ జాబితాలను స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ చేశాం. రెండు జాబితాలలో ఉన్న ఓటర్ల వివరాలను సేకరించి నివేదికను ఉన్నత అధికారులకు అందజేశాం. ఆ తర్వాత ఎన్నికల కమిషన్ ఆదేశాలను అమలు చేస్తాం.

గ్రూప్ 1పై హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులను స్వాగతిస్తున్నాం

- ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్

ప్రజాశక్తి-హైదరాబాద్ బ్యూరో

గ్రూప్-1పై హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులను స్వాగతిస్తున్నట్టు ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ తెలిపారు. బిఆర్ఎస్ నేతలు, అభ్యర్థులను, పేరెంట్స్‌ను మానసిక క్షోభకు గురి చేశారని తెలిపారు. వాళ్లను రోడ్ల మీదకు తీసుకొచ్చారని విమర్శించారు. గురువారం హైదరాబాద్ అసెంబ్లీలోని సిఎల్‌పి కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. గతంలో పేపర్లు లీక్ చేసి, నిరుద్యోగుల జీవితాలతో ఆడుకున్నారని విమర్శించారు. ఇప్పుడు మళ్లీ నిరుద్యోగులను రెచ్చగొట్టి పబ్బం గడుపుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రూప్ 1 పరీక్ష అంటే తెలియని ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి కూడా ఆరోపణలు చేస్తున్నారని తెలిపారు. వాస్తవాలుంటే చట్టపరంగా ఎదుర్కోవాలని సూచించారు. అవాస్తవాలను ప్రచారం చేసి నిరుద్యోగుల జీవితాలతో ఆడుకోవద్దని చెప్పారు. పదేళ్లు అధికారంలో ఉండి ఒక గ్రూప్ 1 పరీక్ష నిర్వహించలేకపోయారని తెలిపారు. పరీక్షలపై అవకతవకలు జరిగితే తానే స్వయంగా నిరుద్యోగుల పక్షాన పోరాటం చేసి, ఆధారాలతోసహా నిరూపించామన్నారు. పదేళ్ల విద్యార్థి నాయకుడిగా, నిరుద్యోగుల సమస్యలపై అవగాహన ఉందని చెప్పారు. నిరుద్యోగుల విషయంలో ఏ పార్టీ నాయకులైనా ఆలోచించి మాట్లాడాలని ఆయన సూచించారు.

ఫార్మసిస్టులంటే మందులు ఇచ్చేవారే కాదు

- ఆరోగ్య రంగంలోనూ వారిది కీలకపాత్ర : రాజీవ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఫార్మసిస్టులంటే మందులు ఇచ్చే వారే కాదనీ, ఆరోగ్యరంగంలో కీలక పాత్ర పోషించే వారని టిపిసిసి మెడికల్ అండ్ హెల్త్ వింగ్ చైర్మన్ రాజీవ్ అన్నారు. ప్రజలకు సరైన సమయంలో సరైన మందులు అందించడం, మందుల వినియోగంపై అవగాహన కల్పించడం, దుష్ప్రభావాలపై హెచ్చరించడం వంటి బాధ్యతలు ఫార్మసిస్టుల భుజాన ఉన్నాయని చెప్పారు. వారి సేవలు మరింత గుర్తింపు పొందాలని తెలిపారు. గురువారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ప్రపంచ ఫార్మసీ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యశాస్త్రం ఎంత వేగంగా అభివృద్ధి చెందుతుందో, అదేస్థాయిలో ఫార్మసీ రంగం కూడా విస్తరిస్తోందని తెలిపారు. ప్రభుత్వం వచ్చిన కొద్ది రోజుల్లోనే వైద్యరంగంలో ఎనిమిది వేలకుపైగా పోస్టులను భర్తీ చేయడం జరిగిందని చెప్పారు. ఇదే వైద్య రంగంపై ప్రభుత్వానికి ఉన్న నిబద్ధతకు నిదర్శనమన్నారు. కొత్త ఔషధాల పరిశోధన, ప్రజలకు అందుబాటులోకి తేవడంలో ఫార్మసిస్టుల పాత్ర అపారమైందని తెలిపారు.'మందులు ఇవ్వడం కాదు...ఆరోగ్యాన్ని అందించడం' అనే నినాదంతో ముందుకు సాగుతున్నారని పేర్కొన్నారు. సమాజంలో వారికి మరింత ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన కోరారు.